క్లుప్తంగా

నేడు ట్రాఫిక్‌పై అవగాహన ర్యాలీ

నరసరావుపేటటౌన్: ట్రాఫిక్ అవగాహనపై సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు వన్‌టౌన్ సీఐ విజయ్‌చరణ్ ఆదివారం తెలిపారు. వన్‌టౌన్, టూటౌన్, ట్రాఫిక్ పోలీస్‌ల సంయుక్త ఆధ్వర్యంలో మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులతో కలిసి ఉదయం 10 గంటలకు గడియార స్తంభం సెంటర్ నుంచి ర్యాలీ ప్రారంభిస్తామని పేర్కొన్నారు. పట్టణ ప్రజలకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించి, వారిని చైతన్యవంతులను చేయాలనే ఉద్దేశంతో కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



యడ్లపాడు: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు కె. సాయిబాబు తెలిపారు. మండలంలోని వంకాయలపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం కాటూరి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో గుండె, గ్యాస్ట్రో, ఆర్థో, కిడ్నీ, ఈఎన్‌టీ, కంటి తదితర వ్యాధులకు సంబంధించిన వైద్యులు హాజరై పరీక్షలు నిర్వహించి, వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు కె. మాధవి, ఆంజనేయులు, బ్రాయాన్, అమూల్య, క్యాంప్ ఆర్గనైజర్ జె. నాగేంద్రబాబు, యూనిట్ ఇన్‌చార్జి ఎస్. శరత్, గ్రామస్తులు షేక్ బుడే, మస్తాన్‌వలి, నాగూర్‌వలి, కె. సాంబశివరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ నూతన ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల



వినుకొండ(నూజెండ్ల): ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులంతా ఓటు హక్కు వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ అన్నారు. కృష్ణా–గుంటూరు పట్టభద్రుల శాసనమండలి సభ్యుని (ఎమ్మెల్సీ) ఎన్నికల కోసం నూతన ఓటర్ల ముసాయిదా జాబితాను ఆయన విడుదల చేసి నోటీస్ బోర్డులో ఉంచారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న గ్రాడ్యుయేట్ ఓటర్లు అంతా వివరాలను తప్పరిసరిగా పరిశీలించుకోవాలని ఆయన సూచించారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే కార్యాలయం దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి



శావల్యాపురం: ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా సంఘం కమిటీ సభ్యుడు రెడ్డి కృష్ణ సూచించారు. ఆదివారం మండలంలోని శానంపూడి శివారు బొందిలిపాలెంలో గల అడవి పేరంటాళ్లమ్మ అమ్మవారి సన్నిధిలోని ఆర్యవైశ్య సత్రంలో 14వ కార్తిక వనసమారాధన నిర్వహించారు. తొలిత వాసవీ అమ్మవారు, పొట్టి శ్రీరాములు, గాం. దీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రెడ్డి కృష్ణ మాట్లాడుతూ కార్తిక మాసంలో వన సమారాధన జరుపుకోవడం వల్ల మనుష్యుల మధ్య సత్సంబంధాలు పెరుగుతాయని తెలిపారు. సంస్కృతులు, సంప్రదాయాలకు శుభ పరిణామమని పేర్కొన్నారు. అనంతరం వనసమారాధన వేడుకల్లో పాల్గొన్న మహిళలకు వివిధ రకాల పోటీలు నిర్వహించి, విజేతలకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు కొల్లిపర శ్రీనివాసరావు, పద్మనాభుని హనుమంతరావు గట్టుపల్లి సత్యనారాయణ, వీరాస్వామి, రెడ్డి జ్వాలా నరసింహారావు, గట్టుపల్లి వీరాంజనేయులు, జవ్వాది అంజయ్య, జక్కా నాగశ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పంట చేలో పాలకంకి నవ్వింది

- మాగాణి భూముల్లో ధాన్యపు సిరులు
- ఆశాజనకంగా వరి పంట
- ఆనందంలో రైతులు
- ఎకరానికి 35 బస్తాల దిగుబడి అంచనా
- గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వానికి వినతి



కోత దశలో ఉన్న వరి పంట

శావల్యాపురం: ఖరీఫ్ సీజనులో సాగు చేసిన వరి పంట ఆశాజనకంగా ఉండటంతో రైతుల్లో ఆనందం నెలకొంది. ఈ ఏడాదిలో వాతావరణం కరుణించింది. అనుకున్నరీతిలో వర్షాలు పడటంతో పాటు జలాశయాలన్నీ నిండు కుండను తలపించాయి. దీంతో సాగర్ ఆయకట్టు పరిధిలోని రైతులంతా మాగాణి భూముల్లో అధికంగా వరి పంట సాగు చేశారు. ప్రస్తుతం పాలు పోసుకొని గింజ వెన్నుదశలో ఉంది. మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో ఖరీఫ్ సీజనులో 2500 ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేశారు. ఒక్కో ఎకరానికి రూ.30 నుంచి 35వేలు దాకా పెట్టుబడులు పెట్టారు. ఈ ఏడాది తెగుళ్ల బెడద లేక పోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కోతలకు సన్నాహాలు

వరి పంట కోతలు డిసెంబరు రెండవ వారం నుంచి ప్రారంభించేందుకు రైతులు సన్నాహాలు చేస్తున్నారు.ఒక్కో ఎకరానికి 30 నుంచి 35 బస్తాల వరకు దిగుబడులు వస్తాయని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. బీపీటీ, జేజే రకాలకు మార్కెటులో గిట్టుబాటు ధర ఉంటుందనే ఉద్దేశంతో అన్నదాతలు అధికంగా సాగు చేశారు.

గిట్టుబాటు ధరపై ఆందోళన

ఆరుగాలం శ్రమించి పంట పండిస్తే తీరా చేతికొచ్చే సమయానికి ధరలు నేలచూపు చూస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కష్టబడి పండించిన పంట తీరా దళారుల చేతిలోకి పోవడంతో చివరకు శ్రమే మిగులుతోంది.కౌలు రైతులు పరిస్థితి దయనీయంగా ఉంటోంది. అప్పులు ఊబిలో కూరుకుపోతున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి చేతులు దులుపుకుంటోంది. క్షేత్రస్థాయిలో రైతులకు ధర అందుతోంది లేనిది పట్టించుకోవడం లేదు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నా అక్కడ రైతులకు సవాలక్ష నిబంధనలు పెడుతున్నారు. రైతులు గత్యంతరం లేక దళారులకే పంటను తెగనమ్ముకుంటున్నారు.

ప్రభుత్వం అండగా ఉండాలి



నేను ఎనిమిది ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేశా. మరో 15 రోజుల వ్యవధిలో కోత కోయటానికి సిద్ధంగా ఉంది. ప్రస్తుతానికి పంట ఆశాజనకంగా ఉంది. ఎకరానికి 30 నుంచి 35 బస్తాలు దిగుబడులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నా. అయితే, ప్రభుత్వం సొసైటీల ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర ప్రకటించాలి. 76 కేజీల బస్తాకు రూ.2 వేల ధర కల్పిస్తే రైతులకు గిట్టుబాటు అవుతుంది. తద్వారా ఆర్థికంగా వెసులుబాటు కలుగుతుంది.

–నాగవరపు వీరాంజనేయులు (మతుకుమల్లి, కౌలు రైతు)

కొనుగోలు కేంద్రాలు తెరవాలి



నేను మూడు ఎకరాల్లో వరి పంట సాగు చేశా. ఎకరానికి రూ. 40 వేలు దాకా పెట్టుబడి పెట్టా. పంట ఆశాజనంగా ఉంది. అయితే, ప్రస్తుత వాతావరణ పరిస్థితులతో భయమేస్తోంది. ప్రకృతి వైపరీత్యాల కల్గినప్పుడు ప్రభుత్వం ఆదుకోవాలి. పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించటం ద్వారా రైతులంతా సంతోషంగా ఉంటారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రాలు తెరవాలి.

–వేగుళ్ల శ్రీధర్ (శావల్యాపురం ,రైతు)

సందడిగా కార్తిక వన సమారాధనలు



కాపు వనసమారాధనకు హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, సినీ నటుడు నరేష్



నూతనంగా ఎన్నికైన బ్రాహ్మణ సంఘం సభ్యులు



రజక నాయకులకు సన్మానం

నరసరావుపేట: స్థానిక సత్తెనపల్లి రోడ్డులోని అయ్యప్పస్వామి దేవస్థానం సమీపంలోని కాపు భవన్ ప్రాంగణంలో ఆదివారం కాపు కార్తిక వన సమారాధన ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్థానిక శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ఆయన కుటుంబ సభ్యులతో పాటు విశిష్ట అతిథులుగా సినీ నటి విజయనిర్మల కుమారుడు సినీ నటుడు నరేష్ హాజరయ్యారు. వీరితో పాటు కాపు సంఘం అధ్యక్షులు పోతుల శంకర్, జనసేన పార్టీ సీనియర్ నాయకులు వంగవీటి శంతన్, పాకనాటి రమాదేవి, గుంటూరు ఆదిత్య మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ స్రవంత్, డాక్టర్ అమూల్య, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రంగిశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు. ప్రజల ఆశీస్సులు ఉంటే కాపు గర్జన పెడదామని కమిటీ సభ్యులకు తెలియచేశారు. దీనికి సుమారుగా 11వేల మంది హాజరైనట్లు ఎడ్యుకేర్ ప్రసాద్ వెల్లడించారు. కార్యక్రమంలో కాపు వన సమారాధన కమిటీ సభ్యులు షిర్డీ శ్రీనివాసరావు పాతూరి నాని, ఏనుగుల సాంబ, ఎల్‌బీసీ బుజ్జి, రామిశెట్టి బుజ్జి, పసుపులేటి హేమంతకుమార్ పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ...

యడ్లపాడు: మండలంలోని బోయపాలెం శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం యడ్లపాడు శ్రీరణవీరాంజనేయ బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో 12వ వార్షిక కార్తిక సమారాధన నిర్వహించారు. ముందుగా ఉసిరి చెట్టుకు పూజలు జరిపారు. సంఘం ఆశయాలు, గత ఏడాది చేపట్టిన సేవా కార్యక్రమాలను సభ్యులు వివరించారు. అనంతరం సంఘం నూతన కమిటీ సభ్యుల ఎన్నికలు జరిగాయి. సమన్వయ కర్తగా చిలకలూరిపేట ఆదిత్య బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ఏకా మారుతీరామశర్మ వ్యవహరించారు. అధ్యక్షులుగా వైబీవీ శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా కేఎంవీ హనుమాన్, గౌరవ అధ్యక్షులుగా పి. హనుమాచార్యులు, ఉపాధ్యక్షులుగా వి. ప్రేమ్‌కుమార్, కార్యనిర్వాహక అధ్యక్షులుగా వైవీ రమేష్‌బాబు, కార్యదర్శులుగా కేవీ హనుమంతరావు, వి. సాయితేజ, పి. శ్రీరామయ్య, కోశాధికారిగా పి. రంగాచార్యులు, ముఖ్య సలహాదారులుగా వంకాయలపాటి ఆనంద్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులంతా కలిసి ఆదిత్య బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడితో పాటు కార్యదర్శి పోలూరి చంద్రమౌళి, సంయుక్త కార్యదర్శి పొలంకి పవన్‌కుమార్, కోశాధికారి పాలూరి శేషగిరిరావును ఘనంగా సత్కరించారు.

రజక సంఘం ఆధ్వర్యంలో..

రొంపిచర్ల : స్థానిక శివాలయంలో రజక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కార్తిక వన సమారాధన నిర్వహించారు. మండలంలో అన్ని గ్రామాల నుంచి రజకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయాన్ని సందర్శించి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కోలాటం, ఇంద్రజాలం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రజక సంఘ నాయకులను సన్మానించారు. కార్యక్రమంలో పాల్గొన్న కోటప్పకొండ రజక అన్నదాన సత్రం కమిటీ అధ్యక్షుడు బాదుగున్నల శ్రీనివాసరావు మాట్లాడుతూ రజకులు అన్ని రంగాలలో రాణించాలని తెలిపారు. పవిత్రమైన కార్తిక మాసంలో వన సమారాధనలు ఏర్పాటు చేసుకోవడం వల్ల ఐక్యత భావం కలుగుతుందని తెలిపారు. అనంతరం ఆలయ ఆవరణలో భారీ అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కోటప్పకొండ రజక అన్నదాన సత్రం కమిటీ కార్యదర్శి సట్టు అయ్యప్ప, మాజీ అధ్యక్షుడు మద్రిపూడి రాంబాబు, రజక సంఘం మండల అధ్యక్షుడు పిడెం హుస్సేన్, కార్యదర్శి వంగపాటి శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షులు అద్దంకి సుబ్బారావు, విభరాపట్నం శ్రీరాములు, మక్కెన రాజు, మోటుపల్లి చిన్న ముసలయ్య పాల్గొన్నారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు రొంపిచర్ల విద్యార్థులు



శ్రీదేవి



రిషివర్ధన్

రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇద్దరు జాతీయ స్థాయి అండర్–14 సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం బి.యం. సుభాని ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు జి. రిషివర్ధన్, వి. శ్రీదేవి ఈ నెల 22,23,24 తేదీల్లో చిత్తూరు జిల్లాలోని అరగొండలో నిర్వహించిన సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపినట్లు పేర్కొన్నారు. ఇద్దరూ డిసెంబర్‌లో మహారాష్ట్రలో జరిగే జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున ఆడనున్నట్లు ఆయన తెలియజేశారు. విద్యార్థులను పీడీ సైదయ్య, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించినట్లు పేర్కొన్నారు.

యోగా పోటీలో వేదాన్షికి ద్వితీయ బహుమతి



నరసరావుపేట ఈస్ట్: న్యూ మాంక్స్ కుంగ్‌ఫూ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం ఎస్ఈసీ కళాశాలలో సౌత్ ఇండియా మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్ పోటీలలో భాగంగా యోగా పోటీలు నిర్వహించారు. ఇందులో సీహెచ్.వేదాన్షి రమ్య ద్వితీయ స్థానం సాధించినట్లు సాయీషా యోగా సెంటర్ ఇన్‌స్ట్రక్టర్ వై.రాజ్యలక్ష్మి తెలిపారు. సౌత్ ఇండియా స్థాయిలో నిర్వహించిన యోగా పోటీలో వేదాన్షి 8 నుంచి 14 సంవత్సరాల వయస్సు విభాగంలో బహుమతి సాధించిందని వివరించారు. ఆర్గనైజేషన్ గౌరవాధ్యక్షుడు, సినీ నటుడు నరేష్ చేతుల మీదుగా బహుమతి అందుకున్నట్లు తెలిపారు.

నేడు వలంటీర్ల ధర్నా

నరసరావుపేట: గ్రామ, వార్డు వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించి బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ సోమవారం ఉదయం 10గంటలకు రైల్వేస్టేషన్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ, అక్కడే ధర్నా నిర్వహిస్తున్నట్లు గ్రామ, వార్డు వలంటీర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ హుమాయిస్ బాషా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత నాలుగు నెలలుగా ఉన్న జీతాల బకాయిలను వెంటనే చెల్లించాలని ఆయన కోరారు. బలవంతంగా రాజీనామా చేసిన వారిని తిరిగి మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని, వారికి రూ.10వేలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. జాబ్ చార్ట్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. వలంటీర్లంతా పాల్గొని ధర్నాను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

26న విద్యార్థులకు పలు పోటీలు

శావల్యాపురం: భారత రాజ్యాంగ దినోత్సవ సంబరాల సందర్భంగా నియోజకవర్గస్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లోని 6 నుంచి 10 తరగతి విద్యార్థులకు ఈ నెల 26న వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ తదితర పోటీలను నిర్వహించనున్నట్లు వివేకానంద పూర్వ విద్యార్థుల కమిటీ చైర్మన్ సంద్రపాటి చలపతిరావు ఆదివారం తెలిపారు. ఒక స్కూల్‌కి ప్రతి విభాగం నుంచి ఒక ఎంట్రీ మాత్రమే అర్హులని పేర్కొన్నారు. పాల్గొనే వారంతా ఈనెల 25లోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. విజేతలకు నగదు, షీల్డ్ బహూకరించనున్నట్లు తెలిపారు. వివరాలకు 9704260300, 9492081140, 7013971312 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

రంగనాయకస్వామి ఆలయంలో కార్తిక పూజలు



యడ్లపాడు: మండలంలోని సొలస గ్రామంలో గల శ్రీభూసమేత రంగనాయస్వామి ఆలయంలో కార్తిక మాసం చివరి ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పర్చూరి రామకృష్ణమచార్యుల ఆధ్వర్యంలో దేవతా మూర్తులకు విశేష అంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఉపాలయం వద్ద దీపాలతో అలంకరించారు. రంగవల్లులు, రంగురంగుల పుష్పాలు, ప్రమిదలు ఏర్పాటు చేసి దీపార్చన గావించారు. భక్తులకు పలురకాల ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వంశపారంపర్య ధర్మకర్తలు అర్వపల్లి మనోహర్, నాగజ్యోతి దంపతులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై నిరసన



వాల్‌పోస్టర్ ప్రదర్శిస్తున్న పీడీఎం నాయకులు

నరసరావుపేట: ప్రతిపక్షంలో ఉండగా విద్యుత్ రంగంలో స్మార్టు మీటర్లను వ్యతిరేకించిన టీడీపీ కూటమి నాయకులు ఇప్పుడు అధికారంలో ఉండి వాటిని ఏర్పాటు చేయటం ప్రజలను వంచించటమే అవుతుందని దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) నాయకులు అన్నారు. ఆదివారం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో స్మార్టు మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ వాల్‌పోస్టర్లు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ రంగంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటుచేయటమంటే ప్రజల నుంచి ముక్కుపిండి డబ్బులు వసూలుచేయటమేనని విమర్శించారు. ఆదానికి రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించడాన్ని తీవ్రంగా ఖండించారు. సెల్లు లాగా కరెంటు రీచార్జ్ చేసుకునే విధానం చాలా ప్రమాదమని, అర్ధరాత్రి అయిపోతే కరెంట్ ఆగిపోయే పరిస్థితి నెలకొంటుందని తెలిపారు. ప్రమాదకరమైన వ్యాపార ధోరని కలిగిన రీచార్జింగ్ విధానాన్ని (స్మార్ట్ మీటర్ల) ప్రభుత్వం వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎం రాష్ట్ర నాయకులు నల్లపాటి రామారావు, జిల్లా కార్యదర్శి జి. రామకృష్ణ పాల్గొన్నారు.

అవయవ దానానికి ముందుకురావాలి



అనుమతి పత్రాలు ప్రదర్శిస్తున్న దాతలు

నరసరావుపేట: సమాజంలో అవయవ, శరీర దానం అంటే తప్పు అనే మూఢ నమ్మకాలను వదిలేసి అవి దానం చేసేందుకు ప్రతిఒక్కరూ ముందుకురావాలని 'అమ్మ నేత్ర–శరీర, అవయవ దాన ప్రోత్సాహకుల సంఘం సొసైటీ' ఉమ్మడి గుంటూరు జిల్లా కో–ఆర్డినేటర్ ఎస్.చలపతిరావు కోరారు. స్థానిక కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించిన నేత్ర శరీర, అవయవ దాన కమిటీ సమావేశానికి పల్నాడు విజ్ఞాన కేంద్రం నేత్ర, అవయవ దాన సబ్ కమిటీ కన్వీనర్ కె.రామబ్రహ్మం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ పల్నాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలలో విరివిగా ప్రచారం చేయాలని తెలిపారు. వైద్య విద్యార్థులకు ప్రయోగాల కోసం మృతదేహాల కొరత ఉండడంతో బొమ్మలతో చేస్తున్నారన్నారు. శరీర అవయవ దానం చేయదలిచిన వారు 94920 81140లో సంప్రదించాలని కోరారు. ముందుగా ఎటువంటి రిజిస్ట్రేషన్ చేయకపోయినా కుటుంబ సభ్యుల రాతపూర్వక అనుమతితో మృతదేహాన్ని స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. కమిటీ సభ్యులు కట్టా కోటేశ్వరరావు మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు నేత్ర, శరీర అవయవదానాలపై బాధ్యతాయుతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. రామబ్రహ్మం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శరీరదాన ఉద్యమంలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. శరీర అవయవ దానం కంటే పెద్ద దానం మరొకటి లేదని తెలిపారు. అవయవ దానం చేయడం ద్వారా మరణించినా జీవించినట్లేనని చెప్పారు. కార్యక్రమంలో సంఘం కో–ఆర్డినేటర్ మహమ్మద్ రఫీ, కమిటీ సభ్యులు అనుముల లక్ష్మీశ్వరరెడ్డి, కామినేని రామారావు, కోయ రామరావు, ఎం.అంకారావు, షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం



మాట్లాడుతున్న ఆంజనేయనాయక్

నరసరావుపేట: అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయనాయక్ తెలిపారు. కోటప్పకొండరోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్–హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) పల్నాడు జిల్లా కమిటీ సమావేశాన్ని జిల్లా అధ్యక్షురాలు కేపీ మెటిల్డాదేవి అధ్యక్షతన నిర్వహించారు. ఆంజనేయనాయక్ మాట్లాడుతూ జిల్లాలో రాజకీయ వేధింపులతో 15 మందికి పైగా అంగన్‌వాడీలతో బలవంతపు రాజీనామాలు చేయించారని, పలువురిపై దాడులు చోటుచేసుకున్నాయని తెలిపారు. రాజీనామా చేయకుండా ధైర్యంగా విధులు నిర్వహిస్తున్న వారి కుటుంబ సభ్యులకు హాని చేస్తామని, పొలం గట్ల దగ్గర రకరకాలుగా వేధింపులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వేధింపులు ఆపకపోతే జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని ఆయన తెలిపారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటూరు మల్లేశ్వరి మాట్లాడుతూ మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా మార్చాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జీవో ఇవ్వాలని కోరారు. మినీ వర్కర్లకు వేసవి సెలవులు, ఖాళీ పోస్టుల్లో పదోన్నతులు, మెయిన్ వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలన కోరారు. గ్రేడ్ –2 సూపర్‌వైజర్ పోస్టులకు మినీ వర్కర్లకు అవకాశం కల్పించాలని, 42 రోజుల సమ్మె మినిట్స్ కాపీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. విధులు నిర్వహిస్తూ చనిపోయిన వారికి మట్టి ఖర్చుల జీఓ వెంటనే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నిర్మల, ప్రసన్న, సాయి కుమారి, సుజాత, సావిత్రి, జయలక్ష్మి , ధనలక్ష్మి పాల్గొన్నారు.

పదోన్నతుల ద్వారా ఖాళీలు భర్తీ చేయాలి : ఎస్‌టీయూ



మాట్లాడుతున్న రామిరెడ్డి

నరసరావుపేట ఈస్ట్: జిల్లాలో ఉపాధ్యాయుల పదోన్నతులను వెంటనే చేపట్టాలని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్.వి.రామిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌టీయూ జిల్లా కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. రామిరెడ్డి మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభంలో 22వేలకు పైగా టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు చూపారని తెలిపారు. అయితే, ప్రభుత్వం మాత్రం 16,347 పోస్టులకు మాత్రమే డీఎస్సీ ప్రకటన చేసిందన్నారు. మిగిలిన 6వేలకు పైగా పోస్టులు ఎందుకు ఖాళీగా ఉంచాలని ప్రశ్నించారు. ప్రభుత్వానికి డేటా సేకరణపై ఉన్న శ్రద్ధ, విద్యా ప్రమాణాలను పెంచి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో ఉంటే బాగుండేదని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి యు. చంద్రజిత్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పీఆర్‌సీ కమిషన్ నియమించి, ఐఆర్ ప్రకటించాలని కోరారు. డీఏలను విడుదల చేసి ఉద్యోగులకు ప్రభుత్వం అండగా ఉండాలని తెలిపారు. సమావేశంలో ఎస్‌టీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.కోటేశ్వరరావు, ఎస్.ఎం .సుభాని, జె.గంగాధరబాబు పాల్గొన్నారు.